# పార్కరుపెన్ను

సుమారు ఏభై ఏళ్ళ క్రితం నాటి మాట! అప్పుడు నేను మా ఊరి బోర్డు స్కూల్లో ఆరోక్లాసో ఏడోక్లాసో చదువుతున్నాను. అప్పట్లో ఓ విచిత్రమైన సంఘటన జరిగింది.

మాది ఉమ్మడి కుటుంబం. మా తాతగారూ నాన్నగారూ కూడా డాక్టర్లే. ఇద్దరూ కలిసి ప్రైవేటుగా ప్రాక్టీసు చేస్తూండేవారు. రోగులకు తాతగారు పరీక్షలు చేస్తే - నాన్నగారు ఆయన సూచనల మేరకు వైద్యం చేసేవారు.

నేను మా తాతగారికి పెద్ద మనవణ్ణి కావటం చేత వీధిలోకి వెళ్ళి చేసుకురావాల్సిన చిన్నచిన్న పనులన్నీ ఆయన నాకే చెప్తూండేవారు. ఆయనకి ఓ కన్ను సరిగా కనిపించేదికాదు. కంటిచూపు సరిగాలేని కారణంగా ప్రతిరోజూ పొద్దున్నే 'న్యూస్ పేపరు' నాతో చదివించుకునేవారు. ఉత్తరాలు కూడా నాతోనే రాయించుకునేవారు. ఆయన చెప్పినదంతా నేను రాశాక, చివర్లో సంతకం మాత్రం పెట్టేవారు.

ఇలా ఆయన ఉత్తరాలన్నీ నేను రాస్తూండటంవల్లనో చెప్పిన పనులన్నీ చేస్తూండటం వల్లనోగానీ, ఓసారి నా పుట్టినరోజు నాడు బజారుకి తీసుకెళ్ళి నాకో పార్కరు పెన్ను కొని, బహుమతిగా ఇచ్చారు.

"దీన్ని నువ్వు నీ పదోక్లాసు వరకూ జాగ్రత్తగా ఉంచుకోవాలి" అన్నారు. కిందంతా ముదురు నీలం.... పైన 'క్యాప్' మాత్రం ఎరుపురంగు... ఎంతో అందంగా ఉండేది పెన్ను. దాన్ని మా అమ్మకు చూపిస్తే 'అది చాలా ఖరీదైన పెన్ను. జాగ్రత్తగా దాచుకో. పోగొట్టుకున్నావంటే తాతగారికి కోపం వస్తుంది' అంటూ హెచ్చరించింది.

ఓరోజు పొద్దున నేను స్కూలుకి వెళ్ళేందుకు తయారవుతుంటే తాతగారు నన్ను పిలిచారు. మా ఇంటి అరుగుమీద వాలుకుర్చీలో కూర్చుని ఉన్న ఆయన దగ్గరకు వెళ్ళాను. ఓ పోస్టుకార్డు నా చేతికిచ్చి "ఏలూరులో ప్లీడరుగారికి అర్జంటుగా ఉత్తరం రాయాలి. చెప్తాను, రాయి" అన్నారు. నేను మా గదిలోకి వెళ్ళి పుస్తకాల సంచీలో ఉన్న పెన్ను తెచ్చి 'త్వరగా చెప్పు, స్కూలుకి టైమైపోతోంది" అన్నాను.

పది నిమిషాల్లో ఆయన చెప్పటం, నేను రాయటం పూర్తయింది. నా స్కూలుకి ఇంకా పది నిమిషాలే టైముంధి.

"త్వరగా సంతకం పెట్టు తాతయ్యా వెళ్ళాలి" అన్నాను. ఆయన సంతకం చేసి "దీన్ని అర్జంటుగా పోస్టు చెయ్యాలి సుమా" అన్నారు, తిరిగి నా చేతికిస్తూ.

"అలాగే" అన్నాను. పెన్నూ ఉత్తరమూ జేబులో పెట్టుకుని.

మా స్కూలుకి వెళ్ళే దారిలో మూడు రోడ్ల కూడలి దగ్గర అప్పట్లో ఒక పోస్టుడబ్బా ఉండేది. అందులో వేసిన ఉత్తరాల్ని రోజుకి ఒక్కసారే - సాయంత్రం మూడున్నరకి తీసేవారు.

"చూడూ, 'అలాగే' అంటూ అశ్రద్ధ చేశావంటే కొంప మునుగుతుంది. 'వచ్చేటప్పుడు వెయ్యొచ్చులే' అని బ్యాగులో పెట్టుకుంటే తమరు మరచిపోగలరు. అది ఎల్లుండి ఉదయానికల్లా ప్లీడరు గారికి అంది తీరాలి. అందుకే తమరికి ఇంతగా చెప్తున్నాను" అన్నారు.

మా తాతగారికి నేనంటే చాలా గారం. ఆ గారంతోనే నన్ను అప్పుడప్పుడు అలా 'తమరూ, మీరూ' అంటూ ఆటపట్టించేవారు. అన్నట్టు ప్రతినెలా నాకు ఒక రూపాయి పాకెట్ మనీ కూడా ఇచ్చేవారు.

నేను పుస్తకాల సంచీకోసం మా గదిలోకి వెడుతూంటే - "ఒరేయ్, ఎందుకైనా మంచిది ఆ ఉత్తరాన్ని చొక్కాజేబులో పెట్టుకో, కనిపిస్తూ గుర్తుగా ఉంటుంది" అన్నారు మళ్ళీ.

నాకు కొంచెం చిరాకొచ్చింది. 'ముసలితనం వల్ల ఆయనకు చాదస్తం బాగా ఎక్కువైం'దని అప్పుడప్పుడూ మా నాన్న - ఆయన పరోక్షంలో విసుక్కోవటం గుర్తుకొచ్చింది.

"చొక్కాజేబులోనే పెట్టుకున్నాను తాతయ్యా. పదిసార్లు చెప్పక్కర్లేదు" నా చిరాకును పైకి కనిపించనీయకుండా అన్నాను. అయినా నా మాటల్లో ఎక్కడో రవ్వంత చిరాకు ధ్వనించడం ఆయన గ్రహించేశారు.

"అదికాదురా... ఆ ఉత్తరం ఎల్లుండికల్లా ఏలూరు చేరిపోవాలి. అది మన 'స్థలం' తాలూకు కేసుకి సంబంధించినది. ఎల్లుండి వాయిదాలో ప్లీడరుగారికి కావాల్సిన కొన్ని వివరాలు అందులో ఉన్నాయి. అందుకే ఇన్నిసార్లు చెబుతున్నాను" అన్నారు.

అప్పటికి నేను మా ఇంటి గేటుదాటి రోడ్డు మీదకు చేరుకున్నాను. స్కూలుకి సమయం మించిపోతోందన్న తొందరలో వడివడిగా నడుస్తూ మూడురోడ్ల కూడలి దగ్గర క్షణం ఆగి, జేబులోంచి ఉత్తరాన్ని తీసి పోస్టు డబ్బాలో వేసేసి, స్కూలుకి పరిగెత్తాను.

★ ★ ★

సాయంత్రం స్కూలునుంచి తిరిగివచ్చేసరికి తాతగారు బయట అరుగుమీద కుర్చీలోనే కూర్చుని ఉన్నారు. ఆయన అడక్కుండానే "ఉత్తరం పోస్టు చేసేశాను తాతయ్యా" అని చెప్పాను.

"థాంక్సండీ మనవడుగారూ" అన్నారు తాతయ్య. ఇంట్లోకి వెళ్ళేసరికి అమ్మ పూరీలు చేస్తోంది.

"త్వరగా కాళ్ళూ చేతులూ కడుక్కుని రా, నీకోసం వేడివేడిగా పూరీలు చేస్తున్నా" అంది నన్ను చూసి. పుస్తకాల సంచీ బల్లమీద పెట్టి, నూతి దగ్గరకు వెళ్ళాను. కాళ్ళు కడుక్కునేందుకు 'గోలెం'లో ఉన్న నీళ్ళను కొంచెం ముందుకు వంగి తీసుకుంటూంటే జేబులో 'ఉత్తరం' కనిపించింది. ఉలిక్కిపడ్డాను. అది పొద్దున్న తాతగారు నా చేత రాయించిన ఉత్తరమే. స్కూలుకి వెడుతూ దాన్ని నా చేత్తో నేనే స్వయంగా డబ్బాలో వేశాను. మరి మళ్ళీ జేబులోకి ఎలా వచ్చింది? అంటే, పొరపాటున డబ్బాలో ఉత్తరం వేయడానికి బదులు వేరే ఏదైనా కాగితాన్ని చూసుకోకుండా హడావుడిలో వేసేశానా? బహుశా అలాగే జరిగి ఉండాలి.

ఆ ఆలోచన వచ్చేసరికి ఒళ్ళంతా చెమట పట్టేసింది. ఏం చేయాలో తోచలేదు. తాతగారి హెచ్చరికలన్నీ పదేపదే చెవుల్లో మార్మోగాయి. నా అజాగ్రత్తే కొంప ముంచింది. పోనీ మళ్ళీ వెంటనే వెళ్ళి దాన్ని డబ్బాలో వేసినా ఇక ఆ రోజుకి 'క్లియరెన్సు' లేదాయె!

'ఇప్పుడెలా?' అనుకున్నాను. మరుక్షణంలో నాకో మెరుపులాంటి ఆలోచన వచ్చింది. మా ఊరి రైల్వేస్టేషన్‌లో 'ఆరెమ్మెస్' ఆఫీసుంది. అందులో ఉత్తరాల్ని స్వయంగా ఇస్తే వాటిని వెంటనే బట్వాడా సంచుల్లో వేసేస్తారు. ఓసారెప్పుడో మా నాన్నగారు ఈ విషయం చెప్పి నాచేత ఓ ఉత్తరాన్ని అలా పోస్టు చేయించారు.

'అమ్మ పెట్టే పూరీల సంగతి దేవుడెరుగు' అనుకుని, గబగబా వీధిలోకివెళ్ళి దగ్గర్లో ఉన్న అద్దె సైకిలు షాపులో సైకిలు తీసుకుని రైల్వేస్టేషన్‌కి చేరుకున్నాను. అక్కడ 'ఆరెమ్మెస్' ఆఫీసులో బట్వాడాసంచులు కడుతున్న పోస్ట్‌మాన్‌ని కలుసుకుని 'ఈ ఉత్తరం అర్జంటుగా ఇవాళ మెయిల్‌లో వెళ్ళాలని డాక్టరుగారు చెప్పమన్నారు' అంటూ దాన్ని అతనికిచ్చాను. ఆ ఉత్తరాన్ని అతను సంచీలో వేసుకునేదాకా అక్కడే ఉండి తర్వాత ఊపిరి పీల్చుకుని ఇంటికొచ్చాను. అప్పుడు అమ్మ పెట్టిన పూరీలు చాలా రుచిగా అనిపించాయి.

ఆ రాత్రి హోంవర్కు చేసుకునేందుకు పుస్తకాల సంచీలో పెన్ను కోసం చూస్తే కనిపించలేదు. మొత్తమంతా వెతికాను. ప్రయోజనం లేకపోయింది. 'ఏమై ఉంటుందీ?' అనుకుంటూ ఆనాటి దినచర్యను రివైండ్ చేసుకున్నాను. పొద్దున్న పెన్నుతో ఉత్తరం రాశాక స్కూలుకి వెళ్ళే తొందరలో ఉత్తరంతోపాటు పెన్ను కూడా జేబులో పెట్టుకున్న సంగతి గుర్తుకొచ్చింది. తర్వాత స్కూల్లో అసలు పెన్నుతో పనిపడలేదు. అంటే, పోస్టు డబ్బాలో ఉత్తరం వేయబోయి, పరాకులో చూసుకోకుండా పెన్ను వేసి ఉండాలి.

ఆ ఆలోచన రాగానే గుండె గుభేల్మంది. ఏం చేయాలో తోచలేదు. మర్నాడు పొద్దున్నే పోస్టాఫీసుకి వెళ్ళి, పోస్టు డబ్బాలోని ఉత్తరాలు క్లియర్ చేసిన 'పోస్టుమాన్'ని అడగాలని నిర్ణయించుకున్నాను. 'ఎప్పుడు తెలవారుతుందా... ఎప్పుడు పోస్టాఫీసుకి వెడతానా... అక్కడ పోస్ట్‌మాన్ కనిపిస్తాడా లేదా... కనిపించినా పెన్ను తీశాడా లేదా... తీసినా తిరిగి ఇస్తాడా ఇవ్వడా?' వంటి ప్రశ్నలు వేధిస్తూంటే రాత్రంతా నిద్రలేకుండా గడిపేశాను.

మర్నాడు పొద్దున్న స్కూలుకి వెళ్ళేముందు పోస్టాఫీసుకి వెళ్ళి అక్కడున్న పోస్టు మాస్టార్ని కలుసుకున్నాను. నన్ను పరిచయం చేసుకుని జరిగిన ప్రహసనమంతా ఆయనకు వివరించాను.

ఆయన నవ్వేశాడు.

"భలేవాడివయ్యా పంతులూ, అంత అజాగ్రత్తా ఆదమరపూ ఉంటే ఎలా? రేపు చదువున్నాక నువ్వు కూడా మీ తాతగారిలాగా నాన్నగారిలాగా డాక్టరువైతే పేషెంట్లకు ఆపరేషన్ చేశాక, కత్తుల్నీ కత్తెరల్నీ వాళ్ళ బాడీలోనే ఉంచేసి కుట్టేస్తావేమో కొంపదీసి' అన్నాడు తను వేసిన జోక్‌కి తనే నవ్వుకుంటూ. ఆ సందర్భంలో నాకు చిరాకనిపించినా మొహమాటానికి నేనూ నవ్వేను. తర్వాత, అంతకుముందురోజు 'మూడురోడ్ల కూడలి పోస్టుడబ్బా'లో ఉత్తరాలు క్లియర్ చేసిన పోస్ట్‌మాన్‌ని పిలిపించి అడిగారు.

అతను ఆ డబ్బాలో తనకు పెన్ను దొరికిందని చెప్పాడు. నేను హాయిగా ఊపిరి పీల్చుకున్నాను. ఇంతలో అతను మళ్ళీ చెప్పాడు - "ఆ పెన్ను నిన్నరాత్రి నా జేబులోంచి మా అబ్బాయి తీసుకున్నాడు బాబూ. వాణ్ణి అడిగి రేపు మీ వీధిలో బట్వాడాకి వచ్చినప్పుడు నేనే మీ ఇంటికి తెచ్చిస్తాను".

"మా ఇల్లు తెలుసుగా?" పిచ్చిప్రశ్నే అయినా అత్రుతకొద్దీ అడిగాను.

"ఈ ఊళ్ళో మీ ఇల్లు తెలవనిదెవరికయ్యా? పైగా మా ఇంట్లో అందరికీ మీ తాతగారే కదా వైద్యం చేసేదీ" అన్నాడు.

మొత్తానికి పెన్నయితే దొరికిందన్న ధీమాతో స్కూలుకి వెళ్ళిపోయాను. అయితే రెండ్రోజులు గడిచినా ఆ పోస్ట్‌మాన్ పెన్ను తెచ్చివ్వలేదు. ఈలోగా తాతగారు ఉత్తరం రాయటానికి పెన్ను తీసుకురమ్మంటారేమోనని తెగ భయపడిపోయాను. మూడోరోజున నేను మళ్ళీ పోస్టాఫీసుకి వెళ్ళి అతన్ని కలుసుకున్నాను.

"నిన్నా మొన్నా మా అబ్బాయి దొరకలేదయ్యా. ఇవాళ పొద్దున్నే వాడి దగ్గర తీసుకుని జేబులో పెటుకున్నా. నేను వచ్చి ఇద్దామనుకుంటూంటే నువ్వే వచ్చావ్" అంటూ

తన ఖాకీకోటులోంచి నా పెన్ను తీసి చేతిలో పెట్టాడు.

దాన్నిచూసి తుళ్ళిపడ్డాను. రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన పేషెంటులా కనిపించింది పెన్ను. దాని క్యాప్ మొత్తం సొట్టలుపడిపోయింది. ఆ క్యాపుకున్న క్లిప్పు పోలియో వచ్చిన వ్యక్తికి కాలు వంకరపోయినట్లుగా వెనక్కి వంగిపోయింది.

"ఇదేమిటీ, ఇలా అయిపోయిందేమిటీ?" అడిగాను బిక్కమొహం వేసుకుని.

"ఓం అదా... చెప్పలేదు కదూ, మా దరిద్రుడికి ఓ దిక్కుమాలిన అలవాటుంది నాయనా. ఎంత మంచి పెన్ను కొనిచ్చినా సరే దాని క్యాపుల్నీ క్లిప్పుల్నీ క్లాసులో పాఠం వింటూ వింటూ పళ్ళ మధ్య పెట్టుకుని కొరికేస్తూంటాడు. పెన్ను క్యాపు కనుక అలా ఆకారమైనా కనిపిస్తోంది. అదే కనుక పెన్సిలైతే దాని చివరి భాగం నమిలేసిన 'పందుంపుల్ల'లా మారిపోతుంది" అన్నాడు నవ్వుతూ.

ఇంకేం మాట్లాడలేక అతన్నిచూసి పళ్ళు కొరుక్కుంటూ పెన్నుని చూసి కన్నీళ్ళు పెట్టుకుంటూ నా పరాకుతనానికి నన్ను నేనే తిట్టుకుంటూ ఇంటికి చేరుకున్నాను.

★ ★ ★

వారం రోజులు గడచిపోయాయి. ఈ వారం రోజుల్లోనూ రెండుసార్లు మా బంధువులెవరికో తాతగారు ఉత్తరాలు రాయించారు. ఆ సమయంలో పెన్ను క్యాపు ఆయనకు కనిపించకుండా జాగ్రత్తపడ్డాను.

ఆ తర్వాత ఓ సాయంత్రం ఎప్పటిలా స్కూలునుంచి ఇంటికొచ్చి, అమ్మ పెట్టిన ఆలూబజ్జీలు తింటూంటే ఆయన పిలిచారు. 'మళ్ళీ ఏదైనా ఉత్తరం రాయాలేమో' అనుకుంటూ పెన్ను జేబులో వేసుకుని నెమ్మదిగా ఆయన దగ్గరకు వెళ్ళాను.

"నీకో శుభవార్త చెప్పాల్రా" అన్నారు నేను కూర్చున్నాక. అదేమిటో అడిగేలోగానే, ఆయన చెప్పారు మళ్ళీ -

"మనం కోర్టులో కేసు గెలిచాంరా!"

నాకు అర్థంకాలేదు.

"ఏలూరులో - మా నాన్న నాకెప్పుడో ఓ వంద గజాల స్థలం ఇచ్చాడు. దాన్ని పక్కవాడెవడో ఆక్రమించుకుని అందులో కట్టెల అడితీ పెట్టాడు. వాడిమీద మనం కేసు పెట్టాం. రెండేళ్ళు అది కోర్టులో నడిచాక - ఇప్పుడు మన పక్షాన తీర్పు చెప్పారు. ఆ స్థలం వెంటనే ఖాళీచేసి మనకు అప్పగించటంతో పాటు ఖర్చులకింద ఇంకో అయిదువేలు కూడా మనకివ్వాలని చెప్పారట. కేసు గెలవటానికి కారణం - వారం రోజుల క్రితం మనం రాసిన ఉత్తరంలోని వివరాలేనట. ఆ విషయమే తెలియజేస్తూ ప్లీడరుగారు

ఉత్తరం రాశారు" సంతోషంగా చూశారు తాతయ్య.

'ఒకవేళ ఆ ఉత్తరాన్ని ఆరోజు నేను రైల్వే స్టేషన్‌కి వెళ్లి 'ఆరెమ్మెస్'లో ఇవ్వకుండా మర్నాడు డబ్బాలో వేసుంటే? అది ప్లీడరుగారికి అందేది కాదేమో! అప్పుడు కోర్టులో కేసు ఓడిపోయేవాళ్ళమేమో' ఆ ఆలోచన రావటంతో క్షణంపాటు గుండె ఆగినంత పనైంది.

"ఇప్పుడు ప్లీడరుగారికి కృతజ్ఞతలు చెప్తూ ఉత్తరం రాయాలి" అంటూ ఓ పోస్టు కార్డు నా చేతికిచ్చారు తాతయ్య. నేను పెన్నుతీసి, ఆయన చూడకుండా దాని క్యాపును జేబులో వేసుకుని "ఊఁ చెప్పు... రాస్తా" అన్నాను.

"దాంతోకాదు. ఈ పెన్నుతో రాయి" అంటూ బనీను జేబులోంచి ఇంకో పెన్ను తీసిచ్చారు.

అది నీలిరంగు పార్కరు పెన్ను. దాని క్యాప్ మాత్రం పసుపురంగులో ఉంది. కొత్తది కావటంవల్ల కాబోలు మెరిసిపోతోంది.

"అరె, పార్కరు పెన్ను! నాకిచ్చిన పెన్నులాంటిదే" ఆశ్చర్యంగా చూస్తూ అన్నాను.

"అవును, పార్కరు పెన్నే. నువ్వు స్కూలు నుంచి వచ్చేముందే షాపుకెళ్ళి కొని తెచ్చాను. 'క్యాపు' ఎరుపురంగులో ఉన్నది దొరుకుతుందేమోనని చూశాను. లేదన్నారు. దీన్నైనా జాగ్రత్తగా దాచుకో. మళ్ళీ ఏ పోస్టుడబ్బాలోనో పారేయకుండా".

నా పెన్ను ఆ రోజున అలా డబ్బాలో వేసిన సంగతి ఆయనకు ఎలా తెలిసిందో అర్థంకాక నోటమాట పడిపోయింది. కొంచెం భయంగా ఆయనవైపు చూశాను.

"తమరు చేసిన నిర్వాకం - ఆ పోస్ట్‌మాన్ చెప్పాడ్లే. కానీ వారంరోజులైనా తమరు మాత్రం చెప్పలేదు. పైగా ఆ క్యాప్ నా కంటపడకుండా జాగ్రత్తపడ్డారు, అవునా?"

తాతయ్య నవ్వుతూనే అడిగినా నాకు ఏడుపొచ్చింది.

"అవును తాతయ్యా! చెప్తే నువ్వు తిడతావని భయంవేసింది" అన్నాను.

"తిట్టడంకాదు, ఇలా కొట్టేవాణ్ణి" అంటూ ఆప్యాయంగా నా తల వెనకాల ఓ చిన్న దెబ్బ వేశారు.

"అయినా తాతయ్యలు తమ కొడుకుల్ని తిడతారేమోగానీ, మనవల్ని తిట్టర్రా, తిట్టలేరు. వాళ్ళని భుజాలమీద పెట్టుకుమోస్తారు. గుండెల్లో దాచుకుంటారు" అన్నారు.

ఆ మాటల్తో ఇక నా కళ్ళల్లో నీళ్ళు ఆగలేకపోయాయి. ఈ సంఘటన జరిగి ఏభై ఏళ్ళు దాటిపోయినా ఇప్పటికీ ఆల్బమ్‌లో ఎప్పుడైనా తాతయ్య ఫొటో చూస్తే అంతా గుర్తుకొచ్చి కళ్ళు చెమరుస్తూనే ఉంటాయి.

***(ఈనాడు, ఆదివారం) 24.7.2011***

★ ★ ★